సాక్షి తిరుపతి

మంగళవారం । 5 । నవంబర్ । 2024



ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోసం పలువురు కదం తొక్కారు. కలెక్టరేట్ వద్ద నిరసనలు మిన్నంటించారు. - 8లో



ఆ రైళ్లను పునరుద్ధరించండి

కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన రైళ్లను మళ్లీ పునరుద్ధరించాలని ఎంపీ గురుమూర్తి సూచించారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో స్వామి దర్శనం లభిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

పెంచలకోనలో భారీ వర్షం



పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతాపంతో అల్లాడిన భక్తులకు కాస్త ఉపశమనం లభించింది.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : పరిశ్రమల్లో పనిచేయడానికి అవసరమైన నైపుణ్యం పొందడానికి నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి ఆ పైన చదువుకున్న వారు అర్హులని తెలిపారు. వారికి తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 90 రోజుల్లో (210 గంటల) పాటు పీఎంకేవీవై స్కీమ్ ద్వారా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం యువత జిల్లాలోని పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8143576866, 9985129995 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలకు బలి కావద్దు



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, సైబర్ నేరాలకు విద్యార్థినులు బలి కావద్దని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సును ఆయన మహిళా వర్సిటీ వీసీ ఉమతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ ఒక భాగమైపోయాయన్నారు. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను సులభంగా బురిడీ కొట్టించి ఆర్థికంగా దోచుకుంటున్నారని చెప్పారు. మనీ ట్రాప్, హనీ ట్రాప్ వంటి సైబర్ నేరానికి ఎవరూ అతీతులు కాదన్నారు. ఇటీవల కాలంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని అసాంఘిక శక్తులు పనిచేస్తున్నాయని, వాటికి సంబంధించిన ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 లేదా తిరుపతి పోలీస్ వాట్సాప్ నం .8099999977కు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు రోజుల పాటు సైబర్ నిపుణుల చేత సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. వీసీ ఉమ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అనేది జీవన ప్రమాణాలను పెంచే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, రిజిస్ట్రార్ రజిని, డీఎస్పీలు వెంకటనారాయణ తిరుపతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన భక్తి

ఆహా.. ఎంత భాగ్యము.. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి సేవలో తరించే మహద్భాగ్యము.. సమస్త లోక విభునికి విరులు సమర్పించే అదృష్టము.. లీలామానుషమూర్తి వైభవాలంకరణలో శోభిల్లే సుగంధ సుమాలను అందించే అవకాశము.. భువి వైకుంఠంలో విరాజిల్లే వేంకటపతి పదసన్నిధిలో పరిమళించే సుమనోహరమాలికలను సమకూర్చే సుకృతము.. ఎన్ని జన్మల పుణ్యఫలమో..దేవదేవుని దివ్యచరణాల చెంత నిత్యం వికసించే పుష్పాలను భక్తిప్రపత్తులతో దరిచేర్చే దాతల జీవితము కదా ధన్యము.



ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన స్వామివారి తలపాగాలు



శ్రీవారి పుష్పయాగం కోసం దాతలు సమర్పించిన పుష్పాలు(ఫైల్)



దాతలు సమర్పించిన పుష్పాలతో తయారు చేసిన హారాలు

అలంకార ప్రియుడికి టన్నుల కొద్దీ పుష్పాలు

- రోజుకు 300 కిలోల పుష్పాలతో శ్రీవారికి అలంకరణ
- గురువారం పూలంగి సేవకు అదనంగా మరో 120 కిలోల పుష్పాలు
- ప్రత్యేక ఉత్సవాలకు అదనంగా 40 టన్నులు
- దాతల నుంచే అధికంగా సేకరణ
- 70 శాతం పుష్పాలు తమిళనాడు నుంచే
- శ్రీవారికి మాను సంపంగి, అమ్మవారికి తామర పుష్పాలు అత్యంత ప్రీతిపాత్రం

తిరుపతి సిటీ: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పుష్పాలంకార ప్రియుడు. సుప్రభాత సేవ మొదలుకొని ఏకాంత సేవ వరకు పలు రకాల పుష్పమాలికలను పూజారులు సమర్పిస్తుంటారు. ఆయా వసంతాలలో లభించే పుష్పాలను అందమైన మాలలుగా తయారు చేసి స్వామివారికి అర్పిస్తుంటారు. భక్తులు సమర్పించే పుష్పాలతోనే పుష్ప కైంకర్యం నిర్వహిస్తున్నారు. తోమాల సేవ పేరిట ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పుష్పమాలలు అలంకరిస్తారు. కల్యాణోత్సవం, వసంతోత్సవం, ఆర్జిత సేవలు, సహస్ర దీపాలంకరణ సేవల్లో ఉత్సవమూర్తులు, పరివార దేవతలకు సైతం పుష్పమాలలు ప్రతినిత్యం అలంకరిస్తారు.

తమిళ భక్తులు, దాతలదే అగ్రస్థానం

తిరుమల ప్రధాన ఆలయంలో పాటు టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలకు అధికశాతం మంది తమిళ భక్తులు, దాతలు పుష్పాలు విరాళంగా సమర్పిస్తున్నారు. శ్రీవారి పుష్పాలంకరణకు అవసరమైన దాదాపు అన్ని రకాల పుష్పాలు తమిళనాడులోని పలు జిల్లాల నుంచి 50 నుంచి 60మంది భక్తులు, దాతలు ప్రతినిత్యం విరాళంగా టీటీడీకి అందజేస్తుంటారు. 20 శాతం మాత్రమే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పుష్పాలను సమర్పిస్తుంటారు.

ప్రత్యేక ఉత్సవాలకు 40 టన్నులు

సాలకట్ల, వార్షిక బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏడాదశి, పుష్పయాగం, ఉగాది, రథోత్సవం, పుష్పపల్లకీ వంటి ప్రత్యేక ఉత్సవాల సమయంలో తిరుమల క్షేత్రం పుష్పవనంగా మారుతుంది. సాలకట్ల, వార్షిక బ్రహ్మోత్సవాలకు కనీసం 40 టన్నులు పుష్పాలు అవసరమవుతుండగా, మిగిలిన ప్రత్యేక ఉత్సవాలకు రోజుకు 7 నుంచి 10 టన్నుల పుష్పాలు తోరణాలు, దేవతామూర్తుల హారాల కోసం, డెకరేషన్ కోసం వినియోగిస్తున్నారు.

శ్రీవారి పుష్పాలంకరణ ఇలా..

రోజువారి సేవలు, కైంకర్యాలకు	300 కిలోలు
ప్రతి గురువారం పూలంగి సేవకు (అదనంగా)	120 కిలోలు
బ్రహ్మోత్సవాలకు	40 టన్నులు
వైకుంఠ ఏకాదశి కోసం	40 టన్నులు
పుష్పయాగం, ప్రత్యేక ఉత్సవాల కోసం రోజుకు	7 టన్నులు
పద్మావతి అమ్మవారి సేవకు రోజుకు	150 కిలోలు
టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలకు రోజుకు	300 కిలోలు



రోజుకు 300 కిలోలు..



ప్రతి రోజూ 300కిలోల పూలు స్వామివారి అలంకరణకు అవసరమవుతాయి. అలాగే గురువారం రోజున మరో 120కిలోల అదనంగా స్వామివారి పూలంగి సేవకు వినియోగిస్తారు. ఇందులో 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు(ఆకులు) కచ్చింతా ఉండేలా అధికారులు జాగ్రత్త పడతారు. స్వామివారి సేవకు ఏడాదికి 150 టన్నుల పుష్పాలు అవసరమవుతాయి. మరో 150 టన్నులు డెకరేషన్‌లకు వినియోగిస్తున్నారు. అలాగే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి రోజుకు 150 కేజీల పుష్పాలను వినియోగిస్తున్నారు. దీంతోపాటు టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాల్లో మరో 150 కిలోల పుష్పాలను వినియోగిస్తున్నారు.

12 రకాల పుష్పాలు, ఆరు పత్రాలతో అలంకరణ

భక్తులు సమర్పించే పుష్పాలలో ప్రధానంగా 12 రకాల పూలు, ఆరు రకాల పత్రాలు ఉంటాయి. ఇందులో శ్రీవారికి అత్యంత ప్రీతి పాత్రమైన మాను సంపంగి(సింహాచలం సంపంగి), అమ్మవారికి ఇష్టమైన తామర పుష్పాలు, చామంతి, రోజాలు, నూరువరహాలు(వృక్ష), గన్నేరు, మల్లెలు, సెంటు జాజులు, మొల్లలు, కనకాంబ్రాలు, కలువలు, మనోరంజితం, తులసి, మొరం, పన్నీరు ఆకు, దవణం, మొగలిరేకులు వంటివి ప్రధానంగా దాతలు టీటీడీకి ప్రతినిత్యం విరాళంగా అందజేస్తుంటారు.



హారాల తయారీలో నిమగ్నమైన టీటీడీ సిబ్బంది

పుష్పాలంకరణలో తోమాల సేవ ప్రధానం

స్వామివారి పుష్పాలంకరణలో తోమాల సేవ ప్రధానమైంది. రోజూ ఉదయం, సాయంత్రం తోమాల సేవను నిర్వహిస్తారు. స్వామి వారి కిరీటం నుంచి భుజాల వరకు శిఖామణి పూలతో అలంకరిస్తారు. అలాగే భుజాల నుంచి పాదాల వరకు రెండు సాలిగ్రామ హారాలు శ్రీదేవీ, భూదేవి మాలలను రూపొందిస్తారు. స్వామివారి అలంకరణ కోసం 25 మెట్లు, 25 కుచ్చులను తయారు చేస్తారు. వీటన్నింటినీ కలిపి తోమాలగా వ్యవహరిస్తారు. తోమాల సేవకు ప్రతిరోజూ ప్రధాన పుష్పాలను తమిళ సినీ హీరో రజినీకాంత్ సైతం విరాళంగా పంపుతున్నారు. పుష్పమాలలు కట్టడానికి 40 మంది సిబ్బంది, 20 మంది శ్రీవారి సేవకులు నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రత్యేక ఉత్సవాలకు పుష్పమాలలు తయారు చేయడానికి నిపుణులను తీసుకొస్తుంటారు. అలాగే పుష్పయాగానికి భక్తులు టన్నుల కొద్దీ పలు రకాల పూలను విరాళంగా అందిస్తుంటారు.

తామర పూలు విరాళంగా ఇస్తున్నాం

చెన్నైలో అడ్వకేట్‌గా పనిచేస్తున్నా. తిరుమల వేంకటేశ్వర స్వామి మా కుటుంబ ఆరాధ్యదైవం. గత కొన్నేళ్లుగా స్వామివారి సేవకు మా వంతుగా ప్రతి రోజూ 250 తామర పూలు విరాళంగా పంపుతున్నాం. దీంతో పాటు పలు రకాల పుష్పాలను ప్రత్యే క సేవలకు విరాళంగా ఇస్తున్నాం. స్వామి వారి సేవలో మా కుటుంబం భాగసామ్యులు కావడం అదృష్టంగా భావిస్తున్నాం.

– శ్రీకాంత్, అడ్వకేట్,చెన్నై

ఈ జన్మకిది చాలు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్‌కు పుష్పాలు విరాళంగా ఇచ్చే అవకాశం ఆ భవంతుడు మాకు కల్పించారు. ఇది పూర్వ జన్మసుక్రుతంగా భావిస్తున్నాం. రోజుకు 30 కిలోలకు పైగా ఆయా వసంతాలలో లభించే రకాలను క్రమం తప్పకుండా పంపుతున్నాను. ప్రధానంగా పత్రాలతో పాటు సంపంగి (లిల్లీ), కనకాంబ్రాలు, సెంటు జాజులు, వృక్ష, మనోరంజితం, మొగలి వంటివి విరాళంగా పంపుతున్నాం. ప్రత్యేక ఉత్సవాలకు 100కేజీల వరకు పంపుతున్నాం. ఈ జన్మకు ఇది చాలు అనే భావన కలుగుతోంది.

– బాలాజీ, కారైకుడి, తమిళనాడు

ఇది నా అదృష్టం

శ్రీవారి తోమాల సేవతో పాటు, కైంకర్యాలకు పుష్పాలను విరాళంగా అందించే అదృష్టం దక్కడం ఆనందంగా ఉంది. స్వామి ఆశీర్వాదంతో కొన్నేళ్లుగా లిల్లీ, చామంతి, తవణం, పన్నీరు ఆకులు, తులసి వంటి పలు రకాలు పుష్పాలతో పాటు పత్రాలను విరాళంగా టీటీడీకి పంపుతున్నాను. బ్రహ్మోత్సవాల సమయంలో పుష్పాలను పంపుతున్నాం.

– శాంతి శ్రీనివాసన్, పుష్పాల విరాళ దాత, చెన్నై

కార్తీక వెలుగులు



శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణిలో కాంతులీనుతున్న కార్తీక దీపాలు



తిరుపతిలోని కపిలతీర్థంలో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీకమాసంలో తొలి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరిలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయం, దేవేంద్ర థియేటర్ వద్దనున్న ఆలయం, మంచినీళ్ల గుంట వద్దనున్న శివాలయం, జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి ఆలయం, మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర శివలింగ క్షేత్రంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు పూజలు నిర్వహించారు. అలాగే నిమ్మ, ఉసిరి కాయలు, పండి దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు.

– తిరుపతి కల్చరల్

కార్పొరేషన్‌లో వైఎస్సార్‌సీపీదే మెజారిటీ

తిరుపతి మంగళం: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో మెజారిటీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ వాళ్లే ఉన్నారని, కానీ వారు చేసే ప్రతిపాదనలను తిరస్కరిస్తుండడం దుర్మార్గమని తిరుపతి మాజీ ఎమ్మెల్యే, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి పద్మావతి పురంలోని భూమన నివాసంలో సోమవారం కార్పొరేటర్లతో ఆయన మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుపతి నగరంలో చిన్నపాటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో టెండర్లు నిర్వహించి నిధులు మంజూరు చేసిన అభివృద్ధి పనులను సైతం కక్ష సాధింపుతో అటకెక్కించారని చెప్పారు. మెజారిటీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ వాళ్లు ఉన్నప్పటికీ కౌన్సిల్లో తమ కార్పొరేటర్లు పెట్టే ప్రతిపాదనలను కక్ష పూరితంగా తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని టీటీడీ నిధులతో పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టగా.. కూటమి నాయకులు అడ్డుకుని కోర్టుకు వెళ్లారని గుర్తుచేశారు. తాగునీటికి రెండవ పైపులైన్ నిర్మాణం కోసం రూ.40 కోట్లతో చర్యలు చేపట్టగా.. మిగిలిన కొంత పైపులైన్ ఏర్పాటు కోసం కార్పొరేషన్ నుంచి రూ.5 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు తెలిపినా కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిధులు మంజూరు కానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఆయన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ఎప్పుడు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించినా గెలుపు వైఎస్సార్‌సీపీదేనన్నారు.



మాట్లాడుతున్న తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

సమగ్ర పోషక యాజమాన్యంపై ముగిసిన శిక్షణ



సహకార సంఘాల అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ స్థానం వేదికగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధికారులకు గత 15 రోజులుగా సమగ్ర పోషక యాజమాన్యంపై ఇస్తున్న శిక్షణ సోమవారం ముగిసింది. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సుమతి మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, కంపోస్ట్, వర్మీకంపోస్టు, జీవన ఎరువుల వాడకం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణ తీసుకున్న అధికారులు తమ ప్రాంతంలోని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో–డైరెక్టర్ డాక్టర్ సంధ్యారాణి, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్ లక్ష్మి, డాక్టర్ వనజ, డాక్టర్ మధుమతి పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.80,950

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,370

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.97,400

రిటైల్ వెండి గ్రాము రూ.100.40

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,489 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,871 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.76 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ టి చైతన్య ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా స్విమ్స్ సైకియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ కే గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భావోద్వేగాలను సమతుల్యపరుచుకుని సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో విద్యపై దృష్టి సారించి ముందుకు సాగాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతి చెందిన రమణయ్య

రేణిగుంట: ఏర్పేడు -వెంకటగిరి మార్గం చింతలపాళెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు.. డక్కిలి మండలం, దగ్గవోలు గ్రామానికి చెందిన టీ.రమణయ్య (79) మేకలు మేపుతుంటాడు. ఆయన మేకల విక్రయం కోసం ఏర్పేడు మండలం, చింతలపాళెంకి వచ్చి తిరుగుపయనం అవుతుండగా, చింతలపాళెం క్రాస్ వద్ద తిరుపతి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతనికి బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆ రైళ్లను పునరుద్ధరించండి

తిరుపతి(అలిపిరి): కోవిడ్ సమయంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించడంతో పాటు కొత్త రైళ్లను నడపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. పలు రైల్వే అభివృద్ధి పనులు, వాటిపై అధ్యయనం చేసేందుకు తిరుపతికి విచ్చేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బృందాన్ని ఎంపీ గురుమూర్తి సోమవారం కలిశారు. తిరుపతి తాజ్ హోటల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీ పలు ప్రతిపాదనలు కమిటీ ముందుంచారు. తిరుపతి–కాట్పాడి, తిరుపతి – గూడూరు, తిరుపతి–ధర్మవరం, తిరుపతి – యర్రగుంట్ల, తిరుపతి – శ్రీకాళహస్తి, నడికుడి మార్గాలను పరిధిగా చేసుకొని తిరుపతి కేంద్రంగా కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతి, రేణిగుంట మీదుగా నెల్లూరు–మైసూర్ మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్నారు. తిరుపతి – విశాఖపట్నం మధ్య వందే భారత్ స్లీపర్ రైలు ప్రవేశ పెడితే వివిధ వర్గాల ప్రయాణికులకు ఎంతో లాభమని ఎంపీ తెలిపారు.

ఉన్న రైళ్ల పొడిగింపు, షెడ్యూళ్లకు మార్పులు

ప్రస్తుతం చిత్తూరు వరకు నడుస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ (12798) కుప్పం వరకు పొడిగించాలి. సికింద్రాబాద్ నుంచి గూడూరు మధ్య నడుస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ (12710) తిరుపతి వరకు పొడిగించాలి. తిరుపతి – సికింద్రాబాద్ మధ్య వారంలో ఐదు రోజులు మాత్రమే నడుస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ (12763)ని రోజూ నడపాలి. పాకాల, ధర్మవరం, గుంతకల్ మీదుగా వారానికి రెండు రోజులు నడుస్తున్న తిరుపతి–సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12731)ని రోజూ నడపాలి. తిరుపతి – రామేశ్వరం మధ్య వారంలో 3 రోజులు నడుస్తున్న మీనాక్షి ఎక్స్‌ప్రెస్, తిరుపతి -బెంగళూరు మధ్య వారంలో 3 రోజులు నడుస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి – కోయంబత్తూరు మధ్య వారంలో 4 రోజులు నడుస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి – షిర్డీ వారానికి ఒక రోజు మాత్రమే నడుస్తున్న రైళ్లను రోజూ నడపాలని ఎంపీ కోరారు.



మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

కొత్త రైళ్ల సేవలకు వినతి

తిరుపతి – బ్రహ్మపూర్, తిరుపతి – వారణాసి, అయోధ్య, తిరుపతి – షిర్డీ (ప్రతిరోజూ), నెల్లూరు – తిరువణ్ణామలై (తిరుపతి – చిత్తూరు) రైళ్లను ప్రవేశ పెట్టాలని ఎంపీ ప్రతిపాదించారు. అలాగే కొత్త మెమో రైళ్లు తిరుపతి నుంచి నెల్లూరు, తిరుపతి – కడప మార్గాల మధ్య ప్రవేశ పెట్టాలని కోరారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

రేణిగుంట నుంచి గూడూరు, తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 3వ లైన్ అభివృద్ధి ఎంతో అవసరం. రేణిగుంట రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలి. గూడూరులోని అంబేద్కర్ నగర్ సమీపంలో 1, 2 పట్టణాలను కలిపే అండర్‌పాస్ వెంకటగిరి, రాజంపేట, రాపూరు, పొదలకూరు వంటి పట్టణాలకు ప్రయాణించేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఇరుకుగా ఉన్న ఈ అండర్‌పాస్‌ను సాఫీగా విస్తరించాలి. తిరుపతి – కాట్పాడి మార్గాన్ని డబుల్ లైన్ చేయాలి. రేణిగుంట రైల్వేస్టేషన్ తిరుపతికి సేవలందించే ఒక ప్రధాన జంక్షన్. రేణిగుంట స్టేషన్ కి 'తిరుపతి ఈస్ట్' స్టేషన్‌గా పేరు మార్చడంతోపాటు తిరుచానూరు స్టేషన్‌ను తిరుపతి సెంట్రల్‌గా మార్పునకు పరిశీలించాలని స్టాండింగ్ కమిటీ దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు.

రైళ్లను ఆపడానికి అభ్యర్థన

వెందోడు రైల్వే స్టేషన్‌లో రైళ్ల నంబర్లు 17405/17406, కృష్ణా ఎక్స్‌ప్రెస్, 17480/17489 తిరుపతి – పూరి, తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని, దక్షిణ రైల్వే జోన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో చెన్నై ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 12604), నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (రైళ్ల నంబర్లు 12655/56), కాకినాడ పోర్ట్–చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 17644) నిలపాలని ఎంపీ సూచించారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని కోరారు.

విమానాశ్రయాలకు దీటుగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

- త్వరలో తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి
- పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్

తిరుపతి (అలిపిరి): రాష్ట్రంలోని రైల్వే స్టేషన్లను విమానాశ్రయాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని అనకాపల్లి ఎంపీ, పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ చెప్పారు. వికసిత్ భారత్‌లో భాగంగా ఏపీలోని రైల్వే స్టేషన్లు కొత్తరూపు సంతరించుకోనున్నాయన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కేంద్ర రైల్వే కమిటీ సభ్యులు తిరుపతిలోని సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. త్వరలోనే అన్ని సౌకర్యాలతో తిరుపతి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు ఎంపీ లక్ష్మణ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం విజయకుమార్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.



నమూనాను పరిశీలిస్తున్న రైల్వే స్టాండింగ్ కమిటీ

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సైదాపురం: మండలంలోని లింగసముద్రం గ్రామ శివార్లలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ క్రాంతికుమార్ దాడి చేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి రూ.26.710 స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

పాముకాటుతో విద్యార్థి మృతి



చరణ్ మృతదేహం

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెంలో సోమవారం పాము కాటుకు గురై విద్యార్థి మృతిచెందాడు. బాలిరెడ్డిపాళెం బండ్లదిబ్బ హరిజనవాడకు చెందిన పంట్రంగం మస్తాన్ కుమారుడు చరణ్(15) బాలిరెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బాలుడు ఆదివారం రాత్రి భోజనం చేసి తండ్రితో కలిసి ఇంట్లో నిద్రించాడు. సోమవారం వేకువ జామున చరణ్ చేతి వేలిపై ఏదో కుట్టినట్టు అనిపించడంతో తండ్రికి చెప్పాడు. నిద్ర మత్తులో ఉన్న తండ్రి అది ఏదోలేరా.. పడుకో అని అన్నాడు. గంట తర్వాత ఒళ్లంతా మత్తుగా.. ఇబ్బందిగా ఉన్న విషయాన్ని చరణ్ తండ్రికి చెప్పడంతో హుటాహుటిన బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఆస్పత్రి మూసేసి ఉండడంతో వాకాడు ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స అందించి గూడూరు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి చరణ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు అంది వుంటే బాలుడు బతికేవాడని గ్రామస్తులు వాపోతున్నారు.

18లోపు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించాలి

- అపరాధ రుసంతో డిసెంబర్ 10 వరకు అవకాశం

తిరుపతి అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజులను ఈ నెల 18వ తేదీలోపు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్.కుమార్ తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 19 నుంచి 25 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి డిసెంబర్ 3 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 4 నుంచి డిసెంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులపైన అయినా రూ.125 చెల్లించాలని, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, అండర్ ఏజ్ సర్టిఫికెట్ కావాల్సిన వారు అదనంగా రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్స్ కోసం అదనంగా రూ.80 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ రెగ్యులర్ విద్యార్థులకు వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతాల్లో రూ.20 వేలు, రూరల్ ప్రాంతాల్లో రూ.24 వేలు, అలాగే మాగాణి, బీడు భూమి 2.5 నుంచి 5 ఎకరాలు వరకు ఉన్న కుటుంబాలకు చెందిన వారికి పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. డబ్లూడబ్లూడబ్లూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. పరీక్ష ఫీజుతో పాటు అన్ని డాక్యుమెంట్స్, నామినల్ రోల్స్‌ను తప్పులు లేకుండా సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.



కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి

విద్యుత్ మోటార్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో విద్యుత్ మోటార్ల చోరీపై మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సోమవారం పోలీసులకు ఫిర్యా దు చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సూళ్లూరు పేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు స్వర్ణముఖి నది నుంచి విన్నమాల గ్రామంలో చెరువు వరకు ఉన్న విన్నమాల సప్లయి చానల్‌కు సాగునీరు అందించేలా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.10 లక్షలకు పైగా మున్సిపాలిటీ నిధులతో ఎల్‌ఏ సాగరం బీడీ కాలనీ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. వాటికి రక్షణ కల్పించకపోవడంతో దుండగులు వాటిని చోరీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఫజులుల్లా ఇటీవల భారీ వర్షాలు కురి సిన సమయంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. వాటిపై క్షుణంగా పరిశీలనలు చేపట్టి ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివా రం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిపూర్ణం.. గణపతి హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గణపతి హోమం ఆదివారంతో పరిపూర్ణమైంది. కార్తీక మా సం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వినాయకస్వామి ప్రతిమను నెలకొల్పి విశేషంగా అలంకరించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అర్చకులు పూజ, జపం, గణపతి హోమం, లఘుపూర్ణాహుతి, నివేదన నిర్వహించారు. గణేశునికి అత్యంత ప్రీతి పాత్రమైన కుడుములు, నెయ్యి, అన్నం, అటుకులు, బెల్లం, అరటిపండ్లు వంటి అష్ట ద్రవ్యాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జపం, హోమం, గణపతి సహస్ర నామార్చన, విశేష దీపారాధన, మంత్ర పుష్పం, హారతి నివేదించారు. ఈ క్రమంలోనే మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీసుబ్రమణ్యస్వామి వారి హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

రక్షించలేనప్పుడు రాజీనామా చేయండి

శ్రీకాళహస్తి: ప్రజలను రక్షించలేనపుడు రాజీనామా చేయాలని మాజీ మంత్రి రోజా డిమాండ్ చేశారు. హోంశాఖ పనితీరును తప్పుబట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 125 రోజులవుతుంటే వందకు పైగా లైంగిక దాడులు, హత్యలు, చంపడాలు, తగులబెట్టడాలు జరిగాయన్నారు. ఇవ్వన్నీ చూస్తుంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆమె మండిపడ్డారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసి గెలిచారు కాబట్టే హామీలను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉన్నా కూడా మహిళలకు రక్షణ కల్పించలేకపోతే ఎలా..? అని ప్రశ్నించారు. వెంటనే హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ కుంభకర్ణుడిలా నిద్రపోయి ఆరు నెలల తరువాత ప్రెస్‌మీట్ పెట్టి ఏదో ఒకటి మాట్లాడేసి వెళ్లిపోవడం కాదన్నారు. పీఠాపురం వెళ్లి కలబొల్లి మాటలు మాట్లాడుతున్నారని, అదేమంటే అధికారులు, పోలీసులు పనిచేయడం లేదంటూ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్‌ఆర్‌సీపీ గతంలో చేసిన పాపాలంటూ నిందలుమోపి తప్పించుకోవాలని చూస్తున్నారని, ఇలాంటి అధికారులను సస్పెండ్ చేసి పనిచేసే అధికారులను పెట్టుకోవాలన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏనాడైనా మూడేళ్ల పాపను లైంగిక దాడిచేసి చంపారా అని ప్రశ్నించారు. డైవర్ట్ పాలిటిక్స్ ధ్యేయంగా సమస్యలు , హామీలు పక్కదోవ పట్టించే విధంగా చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని, పవన్ కల్యాణ్ దానికి వత్తాసు పలుకుతూ ప్రెస్‌మీట్‌లు పెడుతూ సినిమాలో నటించుకుంటూ తన పని తాను చేసుకుంటున్నాడని విమర్శించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే.రోజా

పంచాయతీ కార్యదర్శి లైంగిక వేధింపులపై ఫిర్యాదు

రాపూరు: రాపూపు మండలం సిద్దవరం, రాపూరు పంచాయతీ కార్యదర్శి చెంచయ్య లైంగికంగా వేధిస్తున్నారంటూ కోటూరుపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ నాగలక్ష్మి సోమవారం రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి యల్లంపల్లి శంకరయ్య 1993 ఆగస్టు 20న అనారోగ్యంతో మరణించాడన్నారు. తెలుగు గంగ పథకం కింద రూ.10 లక్షల పరిహారం వస్తుందని అధికారులు చెప్పడంతో పంచాయతీలో డెత్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినట్టు చెప్పారు. ఎన్నిసార్లు తిరిగినా పంచాయతీ కార్యదర్శి శారీకంగా కోరిక తీర్చమని వేధిస్తున్నాడని, వీడియోకాల్‌లో చూడాలని, గూడూరుకు రావాలని వేధిస్తుండడంతో కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా.. ఈ ఫిర్యాదుపై అధికారులు స్పందించి కార్యదర్శిని విచారించాలని ఆదేశించడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు



నిరసన వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. ప్రజాసమస్యల పరిష్కార వేదిక సందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నాలతో హోరెత్తించారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

మహిళలకు భద్రతేది?

ఇటీవల కాలంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. పసిపిల్లలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి ఎక్కువ కావడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆక్షేపించారు. వడమాలపేట మండలంలో మూడున్నరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలాయపల్లె మండలంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం జరిగితే పోలీసులు స్థానికులతో పంచాయితీ పెట్టి డబ్బులిప్పించామని చెప్పడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రాజకీయ వేధింపులొద్దు

ఆశా వర్కర్లుకు పని ఒత్తిడి తగ్గించాలని.. క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిడి తప్పించాలని పలువురు డిమాండ్ చేశారు. ఏపీ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. నేతలు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని వాపోయారు. చార్ట్ ప్రకారం మాత్రమే పనులు అప్పగించాలని కోరారు. జీతాన్ని రూ.10వేల నుంచి రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో ఉండాలంటూ ఒత్తిడి చేయడాన్ని తప్పుపట్టారు. ఏఎన్‌ఎంల కంటే తమకే అధికభారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఏపీ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీరా పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 181 అర్జీలు

గ్రీవెన్స్‌కు 181 అర్జీలు రాగా అందులో రెవెన్యూ సమస్యలపైనే 119 అర్జీలు వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేందర్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలదేవి పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయండి

అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ యూనివర్సిటీలో పనిచేస్తున్న వర్క్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారని, 2012లో నిర్ణయించిన చట్టం ప్రకారమే జీతం పొందుతున్నారని చెప్పారు. కొత్తవేతనం ప్రకారం రోజుకు రూ.538 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, మునిరాజా, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ నాగరత్నమ్మ, మస్తాన్, పరశురాం, చక్రధర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆలీ, రాజేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ ఏవీఎస్‌ఓల బదిలీ

తిరుమల:తిరుమలలో పనిచేస్తున్న నలుగురు ఏవీఎస్‌ఓలను వారి మాతృ సంస్థకు బదిలీ చేస్తూ టీటీడీ సీవీఎస్‌ఓ శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆదేశాల మేరకు ఆలయ ఏవీఎస్‌ఓ మనోహర్, పరకామణి ఏవీఎస్‌ఓ శివయ్య, నాల్గవ సెక్టార్ ఏవీఎస్వో సాయిగిరిధర్, వింగ్ ఏవీఎస్వో పద్మానాభన్‌ను బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించనున్నట్లు సీవీఎస్‌ఓ తెలిపారు.

పరిమితులు దాటొద్దు

వెంకటగిరి రూరల్: బాలికలు, మహిళలకు సంబంధించి వార్తలు రాసేటప్పుడు తప్పనిసరిగా బాధితులు, పోలీసుల అభిప్రాయాలు తీసుకోవాలని, పరిమితులు దాటితే చర్యలు తప్పవని సీఐ ఏవీ.రమణ హెచ్చరించారు. పట్టణంలోని వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బాలాయపల్లి మండలం, కడగుంట గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగినా పోలీసులు పట్టించుకోలేదంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్స్, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడం అవివేకమన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని, ఆ బాలికపై ఎలాంటి అఘాయిత్యాలు జరగలేదని తన తల్లే స్పష్టం చేసిందని ఆయన గుర్తుచేశారు. గ్రామాల్లో ఉన్న పాత పక్షల నేపథ్యంలో బాలిక కుటుంబీకులను ఇబ్బందులకు గురిచేసేందుకు తప్పుడు ప్రచారం నిమిత్తం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు తేలిందన్నారు. ఆ బాలిక పట్ల తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. యూట్యూబ్ చానళ్లలో కొందరు రేటింగ్ కోసం తప్పుడు వార్తలు పోస్టు చేస్తున్నారని మండిపడ్డారు. అటువంటి వారిని గుర్తించి నలుగురు రిపోర్టర్లపై కేసు నమోదు చేశామని చెప్పారు.



సీఐ ఏవీ రమణ

సమస్యకు పరిష్కారం చూపండి

తిరుపతి అర్బన్:ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తే సరిపోదని.. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులతోపాటు పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కారమార్గం చూపాలని వెల్లడించారు.

లోయలోకి దూకేసిన యువకుడు

తిరుమల: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో లోయలోకి దూకేసిన యువకుడు సురక్షితంగా బయటపడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. తెలిసిన వివరాల మేరకు.. తిరుమలకు ప్రయాణించే రెండో ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వద్ద జీపు మరమ్మతులకు గురైంది. అదే సమయంలో ఆ జీపులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా జీపు దిగి లోయలోకి దూకేశాడు. గుర్తుతెలియని వ్యక్తి దూకేసినట్లు గుర్తించిన వాహన డ్రైవర్ అతన్ని వెదికే ప్రయత్నం చేశాడు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం చేరవేశారు. విజిలెన్స్ సిబ్బంది లోయలోకి దిగి ఆ వ్యక్తిని బయటకు తీసుకొచ్చారు. లోయలో దూకిన వ్యక్తి తిరుమలలోని ఓ టీ స్టాల్‌లో పనిచేసే వ్యక్తిగా గుర్తించారు. అతని స్వస్థలం మధ్య ప్రదేశ్ అని విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. మద్యం మత్తులోనే లోయలో దూకినట్లు విజిలెన్స్ ప్రాథమిక విచారణలో తెలిసింది. తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



పోలీసుల అదుపులో యువకుడు